నమస్తే తెలంగాణ
యాదాద్రి భువనగిరి
I హైదరాబాద్, మంగళవారం 4 ఫిబ్రవరి 2025 YADADRI BHUVANAGIRI

## ఎట్టకేలకు యాదాద్రి ఎంఎంటీఎస్‌కు మోక్షం

- కేంద్ర బడ్జెట్‌లో రూ. 690 కోట్లు కేటాయింపు

యాదాద్రి భువనగిరి, జనవరి 3 (నమస్తే తెలంగాణ) : ఎట్టకేలకు యాదాద్రి(రాయగిరి) ఎంఎంటీఎస్‌కు మోక్షం కలిగింది. కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో ఎంఎంటీఎస్ -2కు నిధులు కేటాయించింది. మొత్తంగా రూ. 690 కోట్లను ప్రతిపాదించింది. ఎంఎంటీఎస్ అందుబాటులోకి వస్తే రూ.20 టికెట్‌పై గంట వ్యవధిలో యాదాద్రికి చేరుకునే అవకాశం లభిస్తుంది. హైదరాబాద్‌కు దగ్గరలో ఉన్న ప్రముఖ పుణ్యక్షేత్రం యాదగిరిగుట్టకు వెళ్లే భక్తుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతున్నది. రోజూ సుమారు 25 వేల మంది భక్తు లు వస్తుంటారు. సెలవు రోజులు, ప్రత్యేక సమయాల్లో రెట్టింపు ఉంటారు. ఈ నేపథ్యంలో ఎంఎంటీఎస్ రెండో దశలో భాగంగా ఘట్‌కేసర్ నుంచి యాదాద్రి రైల్వే స్టేషన్ వరకు విస్తరణ ప్రతిపాదనలు ఉన్నాయి. 33 కిలోమీటర్ల మేర పొడిగించేందుకు 2015లో ప్రణాళికలు సిద్ధం చేశారు. కానీ ఇప్పటివరకు పనులు ప్రారంభం కాలేదు. ఏండ్లుగా నిధుల లేమి వెంటాడింది. ఈ ప్రాజెక్టును సొంతంగా చేపడుతామని గతంలోనే కేంద్రం ప్రకటించగా.. తాజాగా నిధులు కేటాయించింది. ప్రాజెక్టులో భాగంగా ఘట్‌కేసర్, బీబీనగర్ భువనగిరి, యాదాద్రి స్టేషన్లు, యార్డులలో అదనపు మౌలిక సదుపాయాలు కల్పిస్తారు.



రిటర్నింగ్ అధికారి ఇలా త్రిపాఠికి నామినేషన్ పత్రాలు అందజేస్తున్న ప్రజావాణి పార్టీ అభ్యర్థి వెంకటేశ్వర్లు

# కులగణన నివేదికపై బీసీల గరంగరం

### తప్పుల తడక సర్వే అంటూ మండిపాటు

### అసంపూర్తి వివరాలతో నివేదికలా అంటూ ప్రశ్నలు

### పూర్తిస్థాయి వివరాలు సేకరించాలని డిమాండ్

### తొందరపాటు చర్యలతో నష్టమన్న వాదనలు



నల్లగొండ ప్రతినిధి, ఫిబ్రవరి3(నమస్తే తెలంగాణ) : కాంగ్రెస్ ప్రభుత్వం ఆదివారం వెల్లడించిన కులగణనకు సంబంధించిన ఇంటింటి సర్వే గణంకాలు ఉమ్మడి నల్లగొండ జిల్లాలో రాజకీయంగా వేడిపుట్టిస్తున్నాయి. ముఖ్యంగా బీసీ సంఘాల నేతలు, సామాజిక వేత్తలు క్యాబినెట్ సబ్ కమిటీ వెల్లడించిన వివరాలపై తీవ్రంగా మండిపడుతున్నారు. 100శాతం సర్వే పూర్తికాకుండానే వెల్లడించిన వివరాల ప్రకారం బీసీలకు నష్టం జరుగుతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ తాజా గణంకాల ప్రకారం బీసీల జనాభా 46.25 శాతమని వెల్లడి కాగా ఇది గతంలో 53శాతం పైగా ఉందన్న విషయాన్ని గుర్తు చేస్తున్నారు. దీనికి సర్వే అసమగ్రంగా ఉండడమే కారణమని ఆరోపిస్తున్నారు. క్యాబినెట్ సబ్ కమిటీ చైర్మన్, మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డినే 96.9శాతం మంది నుంచే డాటా సేకరించినట్లు చెప్పారని, అలాంటప్పుడు ఇది సమగ్ర నివేదిక ఎలా అవుతుందని ప్రశ్నిస్తున్నారు. సర్వేకు అందుబాటులో లేని, వివరాలు వెల్లడించని 3.10శాతం జనాభాకు సంబంధించిన వివరాలు అవసరం లేదా అన్న సందేహాలు వెల్లువెత్తుతున్నాయి. ప్రభుత్వం హడావుడిగా, గందరగోళంగా కులగణన నివేదికను బహిర్గతం చేయడాన్ని తాము తీవ్రంగా ఖండిస్తున్నట్లు బీసీ సంఘాల నేతలు చెప్తున్నారు. వాస్తవంగా సర్వే సమయంలో అందుబాటులో ఉన్న ప్రజలే వివరాలు అందజేశారు. ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిన వాళ్లు, స్థానికంగా లేని వాళ్లు, పలు కారణాలతో సర్వేకు వివరాలు అందించని వాళ్లు కూడా దాదాపు అన్ని చోట్ల ఉన్నట్లు తెలుస్తున్నది. ఇంటింటి సర్వేకు వెళ్లిన సమయంలోనే ఎన్యుమరేటర్లకు కొందరి నుంచి సహాయనిరాకరణ కొనసాగినట్లు వార్తలు వచ్చాయి. వివరాలు వెల్లడించడానికి ఇష్టం లేని వాళ్లను బలవంతం చేయకూడదన్నట్లుగానూ ఆదేశాలు ఉండడంతో కూడా పూర్తిస్థాయిలో వివరాలు రాలేదని సమాచారం. ముఖ్యంగా మున్సిపాలిటీల్లో, పట్టణ ప్రాంతాల్లోని ప్రజల వివరాల సేకరణ సంపూర్ణంగా సాగలేదన్నది నిజం. వీటన్నింటి నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగానే మొత్తం 3.70కోట్ల జనాభాకు గానూ సర్వేలో 3.54కోట్ల మంది వివరాలనే సర్వే బృందాలు సేకరించగలిగినట్లు స్పష్టమైంది. మిగతా 16లక్షల మంది వివరాలు లేకుండా నివేదికను ఫైనల్ చేయడం, మంగళవారం అసెంబ్లీలో ప్రత్యేకంగా చర్చించనుండడం పట్ల జిల్లాలోని బీసీ సంఘాల నేతలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం తొందరపాటు చర్యలతో బీసీలకు అన్యాయం చేయొద్దని హెచ్చరిస్తున్నారు. అవసరమైతే బీసీ సంఘాలు, వివిధ రాజకీయపార్టీల నేతలతో అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలన్న డిమాండ్లు వెల్లువెత్తుతున్నాయి.

### కాంగ్రెస్ పాలనలో బీసీలకు మొండిచెయ్యి



కామారెడ్డి బీసీ డిక్లరేషన్ ప్రకారం స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలి. సుప్రీం కోర్టు తీర్పును సాకుగా చూపి రాష్ట్రంలో బీసీలకు మొండి చేయి చూపే విధంగా రేవంత్ సర్కారు వ్యవహరిస్తున్నది. సుప్రీం కోర్టులో రాష్ట్ర ప్రభుత్వం తరపున రివ్యూ పిటిషన్ వేయకుండా, బీసీ కులాలు, ఉప కులాల వర్గీకరణ చేయకుండా బడుగుబలహీన వర్గాల ప్రజలకు న్యాయం చేయలేదు. వంద శాతం కులగణన జరిగిన తర్వాతనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలి. లేకపోతే బీసీలు కాంగ్రెస్‌కు తగిన బుద్ధి చెబుతారు.

- కొండూరు సత్యనారాయణ, ఎంబీసీ జాతీయ కన్వీనర్,

### బీసీ జనాభాను తక్కువగా చూపడం తగదు



ప్రభుత్వం ప్రకటించిన కులగణన సర్వే నివేదికలో బీసీల జనాభా శాతాన్ని తక్కువగా చూపించడం తగదు. ప్రభుత్వం ప్రకటించిన నివేదిక తప్పుల తడకగా ఉంది. ఇది బీసీలను మోసం చేసేలా ఉంది. తెలంగాణ రాష్ట్రంలో బీసీల జనాభా 60శాతానికి పైగా ఉంటే కేవలం 46శాతం ఉందని ప్రకటించడం హేయమైన చర్య. ఇప్పటికైనా ప్రభుత్వం బీసీ కులాల వారీగా జాబితా ప్రకటించాలి.

- జాజుల లింగంగౌడ్, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి, మిర్యాలగూడ

### బీసీ అభ్యున్నతిపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదు



మంత్రివర్గ ఉప సంఘం విడుదల చేసిన కులగణన నివేదిక అస్తవ్యస్తంగా అసంబద్ధంగా ఉంది. కులగణన సర్వేలో 3.1 లక్షల కుటుంబాల వివరాలు పొందుపర్చలేదని ప్రభుత్వమే స్పష్టం చేసింది. అలాంటప్పుడు అది సమగ్ర నివేదిక ఎలా అవుతుంది. ఏడాది పాలనలో అన్ని రంగాల్లో విఫలం చెందిన రాష్ట్ర ప్రభుత్వం ప్రజల దృష్టిని మరల్చడానికే కులగణన నివేదిక బయటపెట్టింది కానీ బీసీలపై ప్రేమతో కాదు. రాష్ట్ర జనాభాలో సింహభాగం ఉన్న బీసీలను మభ్యపెట్టేందుకు, వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీల ఓట్లు రాబట్టేందుకే ప్రభుత్వం ప్రయత్నిస్తున్నది జగమెరిగిన సత్యం. ఎన్ని హామీలు ఇచ్చినా రాష్ట్రంలోని బీసీలు కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వాన్ని నమ్మే స్థితిలో లేరు. కాంగ్రెస్ పార్టీ అంటేనే బీసీ వ్యతిరేకి. ఇప్పటికీ బీసీలు వెనుకబడి ఉన్నారంటే అందుకు కాంగ్రెస్ పార్టీనే కారణం.

- నోముల భగత్ కుమార్, నాగార్జున సాగర్ మాజీ ఎమ్మెల్యే

### బీసీల లెక్కలు తప్పుల తడకలు



ప్రభుత్వం చేపట్టిన ఇంటింటా సమగ్ర సర్వే పూర్తిస్థాయిలో తప్పుల తడకగా మారింది. జనాభాలో సగానికి పైగా ఉన్న బీసీల లెక్క తేల్చడంలో ప్రభుత్వ యంత్రాంగం విఫలమైంది. రాష్ట్రంలో ఉన్న బీసీల జనాభా లెక్కలను సమర్థవంతంగా చేపట్టకుండా తూతూమంత్రంగా చేసి చేతులు దులుపుకుంది. సర్వే పేరుతో బీసీలను అన్యాయం చేసింది. మరోసారి బీసీల లెక్కలను తేల్చాలి.

-ర్యాకల శ్రీనివాస్, బీఆర్ఎస్ జిల్లా నాయకుడు, భువనగిరి

### కులగణన సర్వే సమగ్రంగా జరుగలేదు



గ్రామాల్లో ఎక్కడ కూడా కులగణన సర్వే సమగ్రంగా జరుగలేదు. జనాభాల్లో సగానికిపైగా ఉన్న బీసీలను 46.25శాతమే అని లెక్క తేల్చడం సరైంది కాదు. కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం పూర్తిస్థాయిలో సర్వే చేశామని చెప్పడం విడ్డూరంగా ఉంది. ఎక్కడ కూడా పూర్తి సమాచారం సేకరించలేదు. ఇదంతా చూస్తుంటే ప్రభుత్వం బీసీల రిజర్వేషన్ శాతాన్ని తగ్గించేందుకు ప్రయత్నం చేస్తున్నట్లనిపిస్తున్నది.

-సుర్వి మల్లేశ్ గౌడ్, మాజీ సర్పంచ్, అంకిరెడ్డిగూడెం, చౌటుప్పల్

### బీసీలకు తీవ్ర అన్యాయం



సమగ్ర కులగణన సర్వేపై కాంగ్రెస్ సర్కార్‌వి పూర్తిగా అబద్ధాలే. సర్వే కనీసం 50 శాతం పూర్తికాకుండానే 98 శాతం పూర్తయిన్నట్లు చెప్పడం బీసీలను మోసం చేయడమే. రేవంత్‌రెడ్డి సర్కార్ బీసీలకు అనే హామీలిచ్చారు కానీ వాటిలో ఏ ఒక్కటీ నెరవేర్చలేదు. సమగ్ర కుల గణన సర్వే విద్య, ఉద్యోగ రాజకీయ రంగంతోపాటు వారి స్థితిగతులు అంచనా వేయడానికి దోహదపడాలి. కానీ అప్పులు, ఆస్తుల గురించి అడగడం ఏమిటి? సమగ్ర సర్వేలో సీఎం, మంత్రులు వారి ఆస్తులు ప్రకటించారా?. ఈ సర్వే ముమ్మాటికీ భూటకమే. బీసీలకు ప్రభుత్వ నుంచి రావాల్సిన పథకాలను అడ్డుకునేందుకే సర్వే చేపట్టినట్టుగా అనుమానం వస్తుంది. తక్షణమే ప్రత్యేక డ్రైవ్ పెట్టి వంద శాతం కులగణన పూర్తి చేయాలి. అప్పుడే స్థానిక ఎన్నికలకు వెళ్లాలి.

-కర్రె వెంకటయ్య, మాజీ సర్పంచ్, కురుమ సంఘం రాష్ట్ర నాయకుడు, యాదగిరి గుట్ట

# కాంగ్రెస్‌లో 'కులం' కలకలం

- 'హస్తం' ప్రజాప్రతినిధుల డైలాగ్ వార్
- ఓ వర్గంపై ఎమ్మెల్సీ మల్లన్న తీవ్ర వ్యాఖ్యలు
- ఆయన పై భువనగిరి ఎమ్మెల్యే కుంభం ఆగ్రహం
- మల్లన్న స్థాయి మరిచి మాట్లాడుతున్నారని ఖండన
- గందరగోళంలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు
- జిల్లా రాజకీయ వర్గాల్లో పెద్ద ఎత్తున చర్చ



యాదాద్రి భువనగిరి, జనవరి 3 (నమస్తే తెలంగాణ) : కాంగ్రెస్‌లో ఓ కులంపై వ్యాఖ్యలు చిచ్చు రాజేసింది. జిల్లాలో క్యాస్ట్ వార్‌కు బీజం పడింది. కులం కామెంట్లు కలకలం రేపాయి. హస్తం పార్టీలోని ప్రజాప్రతినిధులే విమర్శలు చేసుకుంటున్నారు. తొలుత ఓ వర్గంపై ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న తీవ్ర వ్యాఖ్యలు చేయగా.. భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి తిప్పికొట్టి ఖండించారు. ఇప్పుడు జిల్లా రాజకీయాల్లో ఇదే హాట్ టాపిక్‌గా మారింది.

ఉమ్మడి నల్లగొండ- వరంగల్- ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీగా గెలిచిన పల్లా రాజేశ్వర్ రెడ్డి రాజీనామా చేయడంతో ఉప ఎన్నికలో కాంగ్రెస్ మద్దతుతో తీన్మార్ మల్లన్న పోటీ చేసి గెలిచారు. తొలుత స్తబ్ధుగా ఉన్నప్పటికీ ఇటీవల కాలంలో బీసీ నినాదాన్ని ఎత్తుకున్నారు. తరుచూ ఓ సామాజిక వర్గాన్ని టార్గెట్ చేస్తూ ప్రసంగిస్తూ వస్తున్నారు. ఇటీవల హన్మకొండలో జరిగిన బీసీ రాజకీయ యుద్ధభేరి సభలో ఓ కులాన్ని కించపరుస్తూ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. బీసీ కుల గణన సర్వే రిపోర్ట్‌ను ఉచ్చ పోసి తగలబెట్టాలని, ఇది మూకుమ్మడిగా రెడ్లు ఆడుతున్న డ్రామా అని చెప్పుకొచ్చారు. వచ్చే ఎన్నికల్లో బీసీ వ్యక్తి సీఎం కావడం ఖాయమని, రేవంత్ రెడ్డే చివరి ఓసీ సీఎం అని అన్నారు. సొంత పార్టీలో ఉండి.. పార్టీలోనే ఈ వ్యాఖ్యలు పెద్ద దుమారాన్నే లేపాయి. ఈ పంచాయితీ నడుస్తుండగానే.. మల్లన్నపై జిల్లాకు చెందిన మరో కాంగ్రెస్ ప్రజాప్రతినిధి కుంభం అనిల్ కుమార్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్సీపై ఫైర్ అయ్యారు. ''ఆయన పక్కదోవ పట్టిండు..అలాంటోడి గురించి ఏం మాట్లాడుతం. ఒక కులం గురించే చెడుగా మాట్లాడుతున్నడు. ఎవరో.. ఎక్కడో ఓ చోట కూర్చొని తోచినట్లు మాట్లాడటం కాదు. పార్టీలో పక్కదారిలో పోయేటోడు ఉంటడు. ఓ కులాన్ని కించపరిచేలా మాట్లాడటం యాక్సెప్టెన్సీ కాదు. కుల గణన గురించి మాట్లాడినా.. ప్రభుత్వాన్ని నిందల పాల్జేసినా తప్పు. కరెక్ట్ కాదు. మల్లన్న ఎమ్మెల్సీ గెలుపు కోసం అందరం సపోర్ట్ చేసినం. డబ్బులు ఖర్చు పెట్టినం. ఒక్కసారి కాదు.. రెండు సార్లు చేసినం. వట్టిగ నోటికొచ్చినట్లు మాట్లాడటం కరెక్ట్ కాదు. ఆలేరు ఎమ్మెల్యే గురించి కూడా మాట్లాడిండు. ఆయన బీసీ ఎమ్మెల్యేనే కదా..? ఇది తప్పుడు వ్యవహారం. తప్పు తప్పే. ఎవడు చేసినా తప్పే. దాన్ని మేం ఖండిస్తున్నం.'' అని చెప్పారు.

### ఇద్దరి వ్యాఖ్యలపై చర్చలు

సాధారణంగా అధికార, ప్రతిపక్ష పార్టీలు విమర్శలు, ప్రతి విమర్శలు చేసుకుంటాయి. అనేక అంశాల్లో తమ తమ అభిప్రాయాలను వ్యక్తం చేస్తుంటాయి. కానీ జిల్లాలో ఏకంగా ఓ ప్రజాప్రతినిధిపై మరొకరిపై వ్యాఖ్యానించడంతో కాంగ్రెస్ కేడర్‌లో గందరగోళం నెలకొంది. అటు బీసీ అయిన మల్లన్నకు మద్దతు తెలుపాలా..? ఎమ్మెల్యే అయిన కుంభం వైపు ఉండలా అనే సందిగ్ధత నెలకొంది. సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున వస్తున్న ట్రోల్స్‌పై కౌంటర్ కూడా ఇవ్వకుండా సైలెంట్‌గా ఉండిపోతున్నారు. ఇక జిల్లాలో క్యాస్ట్ పాలిటిక్స్ హాట్ టాపిక్‌గా మారింది. రాజకీయ వర్గాల్లో మల్లన్న, కుంభం వ్యాఖ్యలే చర్చించుకుంటున్నారు. ఎక్కడ చూసినా ఇదే అంశంపై మాట్లాడుకుంటున్నారు. వీడియోలను సోషల్ మీడియాలో సర్క్యులేట్ చేస్తున్నారు. ఇంత జరుగుతున్నా అధిష్టానం ఎందుకు జోక్యం చేసుకోవడంలేదని ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.



నకిరేకల్ : మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

## ఎన్నికల ముందు కోతలు.. తర్వాత ఎగవేతలు

### కాంగ్రెస్ ప్రభుత్వంలో అన్నీ మోసాలే: మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి

నకిరేకల్, ఫిబ్రవరి 3 : కాంగ్రెస్ ప్రభుత్వ ఎన్నికల ముందు కోతలు కోసి ఎన్నికల అనంతరం ఎగవేతలుగా మార్చిందని నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య ఎద్దేవా చేశారు. నకిరేకల్‌లోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఏడాది కింద ప్రజాపాలన పేరిట, కులగణన పేరిట, గ్రామసభల పేరిట దరఖాస్తులు తీసుకోవడం తప్ప పరిష్కరించింది లేదన్నారు. అబద్దపు పునాదుల మీద అధికారంలోకి వచ్చి, పాలనలోనూ అబద్దాల పరంపరనే కాంగ్రెస్ ప్రభుత్వం కొనసాగిస్తుందని విమర్శించారు. పదేండ్ల కేసీఆర్ హయాంలో ఎలాంటి దరఖాస్తులు లేకుండా సంక్షేమ పథకాలు అందజేశారన్నారు. 11 విడుతల్లో 73 వేల కోట్ల రూపాయల రైతుబంధు ఇచ్చారని తెలిపారు. 13 లక్షల మందికి లక్ష రూపాయల చొప్పున కల్యాణలక్ష్మి పథకం ఇచ్చారని చెప్పారు. ప్రతిపక్షాన్ని, కేసీఆర్‌ను తిట్టడం తప్ప రేవంత్‌రెడ్డికి పాలన చేతకాదన్నారు. ఆడంబరంగా నిర్వహిస్తున్న గ్రామసభల సాక్షిగా తమ ప్రభుత్వంపై ప్రజల్లో నెలకొన్న వ్యతిరేకత తేటతెల్లమైందని తెలిపారు. రుణమాఫీ, రైతుభరోసా, పంట బోనస్, ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు అర్హులందరికీ ఇస్తామని చెప్పి ఇప్పుడు భారీ కోతలు విధిస్తే ప్రజలు తిరగబడకుంటే ఏం చేస్తారని ప్రశ్నించారు. కాంగ్రెస్ నాయకుల పాపం..అధికారులకు శాపంగా మారిందని తెలిపారు. ఎన్నికల హామీల్లో చెప్పినట్లుగా అర్హులైన అందరికీ ప్రభుత్వ పథకాలు అందజేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ తీర్మాన్ మల్లన్న కేసీఆర్ చేసిన సర్వేనే బాగుందని అని చెప్పారని గుర్తుచేశారు. బీసీలకు 52 శాతం రిజర్వేషన్ ఇస్తా అన్న రేవంత్‌రెడ్డి ఆ ప్రస్తావన లేకుండా చేశారన్నారు. ఎన్ని డైవర్షన్ పాలిటిక్స్ చేసినా 6 గ్యారెంటీలు, 420 హామీలు అమలు చేసేంత వరకూ ప్రజల పక్షాన నిలబడతామని చెప్పారు. సమావేశంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కొప్పుల ప్రదీప్‌రెడ్డి, కౌన్సిలర్ పల్లె విజయ్, మాజీ పీఏసీఎస్ చైర్మన్ పల్‌రెడ్డి మహేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

# టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికకు నామినేషన్లు షురూ

- నోటిఫికేషన్ విడుదల.. 10 వరకు నామినేషన్ల స్వీకరణ
- 13న ఉపసంహరణ గడువు.. అదే రోజు అభ్యర్థుల తుది జాబితా
- ఫిబ్రవరి 27న పోలింగ్, మార్చి 3న కౌంటింగ్
- మొత్తం 24,905 మంది ఓటర్లు
- వివరాలు వెల్లడించిన ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఇలా త్రిపాఠి
- తొలి రోజు ఒక నామినేషన్ దాఖలు

నల్లగొండ ప్రతినిధి, ఫిబ్రవరి3.(నమస్తే తెలంగాణ)/నీలగిరి : వరంగల్-ఖమ్మం-నల్లగొండ ఉమ్మడి జిల్లాల ఉపాధ్యాయ నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కీలకమైన నామినేషన్ల ఘట్టం మొదలైంది. సోమవారం ఎన్నికల రిటర్నింగ్ అధికారి, నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి నోటిఫికేషన్ విడుదల చేయగా, ఆ వెంటనే నామినేషన్ల ప్రక్రియ షురూ అయ్యింది. సోమవారం నుంచి ఈ నెల 10 వరకు సెలవు దినాల్లో(8,9 తేదీల్లో) మినహా మిగతా రోజుల్లో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్ల స్వీకరణ కొనసాగనుంది. 11న పరిశీలన, 12న అభ్యంతరాల స్వీకరణ, 13న ఉపసంహరణ గడువు ముగిసిన వెంటనే మధ్యాహ్నం 3 గంటల తర్వాత అభ్యర్థుల తుది జాబితా వెల్లడికానుంది. ఈ నెల 27న పోలింగ్, వచ్చే నెల 3న నల్లగొండలోని ఆర్జాలబావి గోదాములో కౌంటింగ్ జరుగనుంది. కాగా తొలి రోజు ప్రజావాణి పార్టీ తరుపున లింగిడి వెంకటేశ్వర్లు ఒక సెట్ నామినేషన్ పత్రాలను దాఖలు చేశారు.

### కలెక్టరేట్‌లో హెల్ప్ డెస్క్

నల్లగొండ కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ ఇలా త్రిపాఠి ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేశారు. అనంతరం నోటిఫికేషన్‌కు సంబంధించిన పూర్తి వివరాలను వెల్లడించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికలకు రిటర్నింగ్ అధికారిగా తాను, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులుగా ఆయా జిల్లాల అదనపు కలెక్టర్లు వ్యవహరిస్తారని తెలిపారు. నామినేషన్ల సందర్భంగా అభ్యర్థులకు ఇబ్బందులు కలుగకుండా ఉండేందుకు రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో ప్రత్యేకంగా హెల్ప్‌డెస్కను ఏర్పాటు చేశామన్నారు. ఏమైనా సందేహాలు ఉంటే నివృత్తి చేసుకోవచ్చని తెలిపారు. ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలను అన్ని రాజకీయ పార్టీలు, అభ్యర్థులు తప్పకుండా పాటించాలన్నారు. అభ్యర్థులు అఫిడవిట్ల సమర్పణ, అన్నెక్సర్ 26 ఫొటోల విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని ఆమె కోరారు. నియోజవకర్గం మొత్తం 24,905 మంది ఓటర్లు ఉన్నారని ఆమె వెల్లడించారు. అభ్యర్థులు, రాజకీయ పార్టీలు ర్యాలీలు, సమావేశాలు నిర్వహించేందుకు ముందస్తు అనుమతి తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. కాగా ఎల్లుండి నుంచి నామినేషన్ల దాఖలు ఊపందుకోవచ్చని తెలుస్తున్నది. ఇప్పటికే దాదాపుగా ప్రధాన సంఘాల నుంచి అభ్యర్థులంతా ఖరారు అయ్యారు. వీరంతా ఎన్నికల ప్రచారంలో బిజీబిజీగా గడుపుతున్నారు. మంచిరోజు చూసుకుని నామినేషన్ల దాఖలుకు సన్నద్ధమవుతున్నారు. ఇదే సమయంలో నామినేషన్ల దాఖలు సందర్భంగా భారీ ఎత్తున ర్యాలీలు, సభల నిర్వహణకు కూడా సన్నహాలు చేస్తున్నారు.

### జిల్లాల వారీగా తుది ఓటర్ల సంఖ్య

| జిల్లా | పోలింగ్ కేంద్రాలు | ఓటర్ల సంఖ్య |
|---|---|---|
| సిద్దిపేట | 4 | 163 |
| జనగాం | 12 | 921 |
| హన్మకొండ | 15 | 5,098 |
| వరంగల్ | 13 | 2,225 |
| మహబూబాబాద్ | 16 | 1,618 |
| భూపాలపల్లి | 7 | 323 |
| ములుగు | 9 | 612 |
| భద్రాద్రి కొత్తగూడెం | 23 | 1949 |
| ఖమ్మం | 24 | 3,955 |
| యాదాద్రి భువనగిరి | 17 | 921 |
| సూర్యాపేట | 23 | 2,637 |
| నల్లగొండ | 37 | 4483. |
| మొత్తం | 200 | 24905 |



ఎమ్మెల్యే మందుల సామేల్‌కు వ్యతిరేకంగా మోత్కూరులో నిర్వహించిన కాంగ్రెస్ కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న ఎస్సీ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ నగరిగారి ప్రీతం, ఆ పార్టీ నేతలు

# ఎమ్మెల్యే సామేల్‌పై తిరుగుబాటు

- తుంగతుర్తి కాంగ్రెస్‌లో అసమ్మతి గళం
- మోత్కూరులో సమావేశం.. హాజరైన నియోజకవర్గ కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు
- పార్టీ అధిష్టానానికి అనుగుణంగా ఎమ్మెల్యే పనిచేయాలని హెచ్చరిక

మోత్కూరు, ఫిబ్రవరి 3 : తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ అక్రమ ఆస్తులు, సంపాదన లక్ష్యంగా, పదవులు, పర్సంటేజీలు తప్ప కార్యకర్తలను పట్టించుకోవడం లేదని ఆయన అసమ్మతివాదులు మండిపడ్డారు. మోత్కూరు పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో సోమవారం తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్‌కు వ్యతిరేకంగా సొంత పార్టీకి చెందిన నియోజకవర్గంలోని ఆయా మండలాలకు చెందిన ముఖ్య నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్‌తోపాటు డీసీసీ ఉపాధ్యక్షుడు పైళ్ల సోమిరెడ్డి, సూర్యాపేట డీసీసీ ఉపాధ్యక్షుడు యోగానందచార్యులు, మోత్కూరు మండలాధ్యక్షుడు వంగాల సత్యనారాయణ, వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వల్లంభట్ల పూర్ణచందర్‌రావు, సీనియర్ నాయకులు, నారగోని అంజయ్యగౌడ్ హాజరై మాట్లాడారు. అవకాశం కోసం వచ్చిన సామేల్‌ను ఆదరించి పార్టీ టికెట్ ఇచ్చి ఎమ్మెల్యే గెలిపిస్తే, పార్టీ కార్యకర్తలను ప్రభుత్వ, పార్టీ కార్యక్రమాల్లో కలుపుకొని పోకపోగా అక్రమ కేసులను పెట్టి పోలీసులతో వేధింపులకు గురి చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. పనుల కోసం తన దగ్గరకు వెళ్లిన వారిని 'నా మనిషివి కాదని, పలాన మంత్రి మనిషివి' అంటూ ఇబ్బందులకు గురి చేస్తున్నారని తెలిపారు. ఎమ్మెల్యే సామేల్ పార్టీ అధిష్టానం ఆర్డర్ కింద పని చేయాలని, నాయకులందరినీ కలుపుకొనిపోవాలని, లేకపోతే సహించేది లేదని, ప్రతి పర్యటనను అడ్డగిస్తామని హెచ్చరించారు. సామేల్ తన కొడుకులకు రాష్ట్ర స్థాయిలో పార్టీ పదవులు కావాలని, అభివృద్ధి పనుల్లో కాంట్రాక్టులు తప్ప ఇంకో పని లేదన్నారు. సామేల్‌కు క్యాడర్ లేదని, పార్టీ క్యాడర్ తెలంగాణ రాష్ట్రం ఇచ్చిన సోనియా గాంధీ రుణం తీర్చుకోవడం కోసం ఎమ్మెల్యేగా 50 వేల మెజార్టీతో గెలిపించారని తెలిపారు. తెలంగాణ ఉద్యమ కారుడిని అని చెప్పుకునే నైతిక హక్కు మందుల సామేల్‌కు లేదని, అమరుడు శ్రీకాంతాచారి తల్లి కాసోజు శంకరమ్మ మండి పడ్డారు. చావు నోట్లో తల పెట్టి కేసీఆర్ దీక్ష చేపడితే సోనియా గాంధీ తెలంగాణ ఇస్తే, కేసీఆర్ పుణ్యమాని గిడ్డంగుల సంస్థ చైర్మన్‌గా పదవులను అనుభవించాడని తెలిపారు. పదేళ్లలో ఏనాడు కూడా అమరులను తలచి నివాళి అర్పించలేదన్నారు. ఎన్నికల్లో ఇసుకను దోచుకున్నారని పదే పదే ఆరోపణలను చేసిన సామేల్ ఇప్పుడు నీళ్ల కింద ఉన్న ఇసుకను తన కొడుకులతో ఇసుక మాఫియా కొనసాగిస్తూ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని బద్నాం చేస్తున్నారని మండల కాంగ్రెస్ అధ్యక్షులు వంగాల సత్యనారాయణ, లక్ష్మీదేవికాల్వ మాజీ సర్పంచు నారగోని అంజయ్య ఆరోపించారు. అడ్డగూడూరులో రూ.90లక్షలు, మోత్కూరులో రూ.40లక్షల కాంట్రాక్టులను తన కొడుకులకు ఇప్పించాడన్నారు. నియోజకవర్గంలో జరుగుతున్న పలు అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలపై పర్యవేక్షణ చూడకుండా పర్సంటేజీలను పుచ్చుకోవడం కోసం అధికారులను, కాంట్రాక్టర్లను వేధిస్తున్నారని మండి పడ్డారు. ప్రశ్నిస్తే పోలీసులతో అక్రమ కేసులు పెట్టి జైళ్లకు పంపుతున్నారని వాపోయారు. పార్టీ బలోపేతం కోసం, ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు అందించడంతోపాటు ప్రతి కార్యకర్తకు అండగా ఉంటానని ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ నగరిగారి ప్రీతం తెలిపారు. మోత్కూరు మండల కాంగ్రెస్ అధ్యక్షులు వంగాల సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో అర్వపల్లి మండలాధ్యక్షుడు సత్యం, నాయకులు పర్రె పాటి యుగేందర్, రాచకొండ రమేశ్, తండ సత్తయ్య, మెంట నాగేశ్, బుషిపాక నర్సింహ, గూడెపు పాండు, నాగరాజు, ఆయా గ్రామాల శాఖల అధ్యక్షులు, మాజీ సర్పంచులు పాల్గొన్నారు.

రీజనింగ్ నాగేశ్వర్ రావు | తెలంగాణ ఉద్యమం చరిత్ర లింగస్వామి సార్
జాగ్రఫీ జానయ్య సార్ | హిస్టరీ శేఖర్
పాలిటి ముత్యాలు | బయోసైన్స్ సీతారాంరెడ్డి
GK & CA నందగోపాల్ | ఎకానమీ గంగరాజు
అర్థమెటిక్ భరత్ సార్ | ఫ్యాకల్టీ టీం ఆధ్వర్యంలో
SI-PC | RRB Group-D | FBO VRO
Group - II, III, IV, అడ్మిషన్లు జరుగుచున్నది
తరగతులు ప్రారంభమైనవి ఉదయం: 10 గం.లకు
SLICE2 కోచింగ్ సెంటర్
LPT మార్కెట్ Hyd. రోడ్, నల్లగొండ, తిరుమల టాకీస్ ప్రక్కన
7989568604, 9676688651